# డ్రైవర్ దేవుడు

★★★

తెల్ల తెల్లవారుతోంది. జనసంచారమంతగా లేదు. జంఝావతి ప్రాజెక్టుకి సంబంధించిన ఒక లారీ యమా స్పీడుతో పార్వతీపురం మెయిన్ రోడ్డులో ప్రవేశించింది. అది ప్రవేశించడం, ఒక ఊరకుక్క దాని టైర్లకు బలి అవ్వడం, చూసికూడ డ్రైవర్ నిర్లక్ష్యంగా దాటుకుపోవడం, పెట్రోల్ బాంక్ కి పెట్రోల్ పోసుకోడానికి లారీ పోవడం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయ్! లారీని, దాని నంబర్ని, లారీ కింద పచ్చడైన కుక్కనూ, లారీలోని డ్రైవర్ని-అప్పుడే చెలువునుండి వస్తున్న నిరుద్యోగి అయిన మురళీ చూడడం తటస్థించింది.

మర్నాడే విజయనగరంలో మురళీకి యింటర్వ్యూ. డబ్బుల్లేక యింటర్వ్యూకి వెళ్ళడ మవ్వదనే అప్పటివరకు అనుకొన్నాడు. కాని యీ యిక్సిడెంట్ చూడడంతో అతనిలో ఆశ చిగురించింది. 'బ్రైటు బెస్ట్ ఆఫ్ మైలక్' అనుకొని ప్లాన్ను కార్యరూపంలోనికి దించాడు. గబగబ యింటికి పోయి ఒక పాత బెల్టును సంపాదించాడు. దానిని నలిగిపడివున్న కుక్క మెడకు చుట్టేశాడు. అటుగా పోతున్న పదిమంది మిత్రుల్ని కూడగట్టుకొన్నాడు.

అంతలో అతడూహించే రీతిలోనే లారీ పెట్రోల్ బంక్ నుండి తిరుగుముఖం పట్టింది. మిత్రుల్ని రోడ్డుకడ్డంగ నిలబెట్టించడంతో లారీ ఆగిపోక తప్పలేదు. లారీనుండి డ్రైవర్ దిగేవరకు మిత్రులంతా నానా హంగామా చేశారు. డ్రైవర్ దిగేసరికి మురళీ డ్రైవర్ కాలర్ పట్టుకొని, 'రాస్కెల్! నా టామీని మట్టంచేసి చల్లగా జారిపోవాలనుకున్నావా? ఏఁవిటి?! సమయానికి నేను చూడడం తటస్థించింది గానీ లేకపోతే వందరూపాయలిచ్చి కొనుక్కున్న నా టామీకి వూర కుక్కకు పట్టిన గతి పట్టివుండేది కదా' అని అతడి కాలర్ విడిచిపెట్టి లబోదిబోమని కుక్కను చూస్తూ ఏడ్వసాగేడు.

డ్రైవర్ కంతా అగమ్యగోచరంగా వుంది. చచ్చి పడివున్న కుక్కను పెంపుడు కుక్కని విశ్వసించలేకపోతున్నాడు. వుండబట్టలేక మురళీపై మండిపడిపోతూ, 'ఊరకుక్క మెడలో బెల్టువేసి పెంపుడు కుక్కని హంగామాచేసి నా వద్దనుండి డబ్బు గుంజాలనుకొంటున్నావా? ఆ పప్పులు నా దగ్గర వుడకవ్, పెంపుడు కుక్కయితే లైసెన్స్ చూపించు. అప్పుడు నమ్మగలను' అని షర్టు చేతులు మడిచాడు.

మురళీ మిత్రులంతా మురళీ పథకం ఫెయిల్ అయిందనుకొన్నారు. మిత్రులికేసి జాలిగ చూడసాగారు. మురళీలో మాత్రం గాంభీర్యం చెక్కుచెదరలేదు. దురుసుగా, 'ఏడిశావ్! నన్నేదో యిరకాటంలో పడేసేటట్టు పెద్ద ఫోజు కొడుతున్నావ్! నా వద్ద లైసెన్స్ వున్నదీ లేనిదీ పోలీస్ స్టేషన్ లో తేల్చుకొందాం. పద పోలీస్ స్టేషన్ కి. తప్పతాగిన ప్రతివెధవ యిలాగే లాజిక్కులు తీస్తుంటాడు. మందుకొట్టి డ్రైవ్ చేస్తున్నావని నీ డ్రైవర్ లైసెన్సు కేన్సిల్ చేయిపిస్తాను. అప్పటికిగాని నీ పొగరు అణగదు' అని డ్రైవర్ షర్ట్ పట్టుకొన్నాడు మురళీ రెట్టింపు ఉత్సాహంతో.

డ్రైవర్ మారు పలకలేకపోయాడు. కొద్ది క్షణాల క్రిందటే లారీకి పెట్రోల్ పోయించేక తను బంకు పక్కనేవున్న సందులోకి వెళ్ళి గవర్నమెంట్ టీ కొద్దిగ సేవించి వచ్చాడు. ఇప్పుడుగాని స్టేషనుకి వెళ్తే ఉద్యోగానికే ఎసర కలగొచ్చు. అందుకే మురళీకి లొంగిపోయాడు. అతడి కాళ్ళా వేళ్ళా పడి పాతిక రూపాయలు సమర్పించుకొని ఆ ఊబినుండి బయటపడ్డాడు.

లారీ వెళ్ళిపోయేక మురళీ మిత్రబృందానికి 'సింహాచలం పాకా విలాస్'లో టీ నీళ్ళు పోయించి వాళ్ళను విదిలించుకొన్నాడు. మర్నాడు విజయనగరంలోని ఇంటర్వ్యూకి హాజరయ్యాడు. ఇంటర్వ్యూలో సెలక్టయి అక్కడకు దగ్గరగ వున్న గ్రామంలో ఉద్యోగం సంపాదించాడు.

రోజులు గడుస్తున్నాయ్. పార్వతీపురం వచ్చినప్పుడల్లా డ్రైవర్ కోసం వెదుకుతున్నాడు. అతడు కనిపిస్తే అతనినుండి అన్యాయంగా గుంజిన పాతిక రూపాయలను సమర్పించుకొని తన శక్తిమేరకు అతన్ని సంభావించా లనుకొన్నాడు. కాని ఆ డ్రైవర్ దేవుడు అతడికింకా కనిపించలేదు.

—బెలగాం భీమేశ్వరరావు.

**Edited and Published by A. N. Raghavachar, No. 10, Murugesa Mudali Street, Madras-600 001.**
**Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47 & 49, Badrian Street, Madras-600 001**